సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 17 । ఏప్రిల్ । 2023



చందనోత్సవానికి శ్రీకారం

ఏకాదశి పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో తొలి విడత చందనం అరగదీత ప్రారంభమైంది. 8లో



జగనన్న పాలనలోనే అభివృద్ధి

జగనన్న పాలనలోనే మన్యంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి అన్నారు. 8లో



డ్రోన్‌తో భవిత

ప్రస్తుత రోజుల్లో నందడంతా డ్రోన్లదే. పలు సందర్భాల్లో వీటి వినియోగం గణనీయంగా పెరిగింది. 8లో

రంజాన్ వేళలు

అరకు/పాడేరు:

	ఇఫ్తార్ (సోమ)	సహర్ (మంగళ)
అరకు/పాడేరు	6-14	4-22
రంపచోడవరం	6-29	4-24

న్యూస్‌రీల్

ఉత్తమ పీడీగా నూకరాజు

- సత్కరించిన విశాఖ ఒలంపిక్ అసోసియేషన్



ప్రశంసాపత్రం, చెక్కును అందుకుంటున్న నూకరాజు

కొయ్యూరు: స్థానిక కుస్తీ అకాడమి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న ఆశ్రమ పాఠశాల పీడీ అంబటి నూకరాజును 2021–22కు ఉత్తమ ఉమ్మడి విశాఖ జిల్లా పీడీ, పీఈటీగా విశాఖ ఒలంపిక్ అసోసియేషన్ ఎంపిక చేసింది. ఈ మేరకు ఆదివారం నూకరాజును విశాఖలో ఘనంగా సత్కరించారు. రూ.10 వేల విలువైన చెక్కు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు.ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పరశురామ్, కార్యదర్శి మాణిక్యాలరావు, అసోసియేషన్ సభ్యులు గణబాబు అభినందించారు. నూకరాజు గత ఐదేళ్ల నుంచి కొయ్యూరులో కుస్తీ ఆకాడమీని బలోపేతం చేశారు. ఇక్కడి నుంచి విద్యార్థులను రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తున్నారు. ఇటీవల పదిమంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

మారేడుమిల్లిలో భారీ వర్షం

- రోడ్డుకడ్డంగా కూలిన చెట్టు



రంపచోడవరం రోడ్డుపై కూలిన చెట్టు

మారేడుమిల్లి : మండల కేంద్రమైన మారేడుమిల్లిలో ఆదివారం మధ్యాహ్నం ఈదురుగాలులతో వడగళ్ల వాన కురిసింది. సుమారు రెండు గంటల పాటు కురిసిన వర్షానికి చెట్ల కొమ్మలు విద్యుత్ వైర్లపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వర్షం తగ్గిన వెంటనే మరమ్మతులు చేపట్టి సరఫరాను సిబ్బంది పునరుద్ధరించారు. మారేడుమిల్లి–రంపచోడవరం రహదారిలో గిరిజన సంక్షేమ గురుకుల కళాశాల వద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు కూలింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

కొయ్యూరులో భిన్నవాతావరణం..



కొయ్యూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: కొయ్యూరులో భిన్న వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండతీవ్రత ఎక్కువగా ఉంది. మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సుమారు 45 నిమిషాలపాటు కొయ్యూరు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీనికి తోడు ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులు వీయడంతో గిరిజనులు భయాందోళనలు చెందారు.

మారుజాతి కలప పట్టివేత

- రెండు ట్రాక్టర్ల సీజ్



సీజ్ చేసిన కలప ట్రాక్టర్లతో అటవీశాఖ అధికారులు

రాజవొమ్మంగి: మండలంలోని సంజీవనగరం అటవీప్రాంతం నుంచి ఆదివారం తెల్లవారుజామున మారుజాతి కలపతో వెళ్తున్న రెండు ట్రాక్టర్లను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. వాటిని స్థానిక అటవీక్షేత్రకార్యాలయానికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పాపంపేట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ అర్జున్ తెలిపారు. రాత్రి వేళలో గస్తీ తిరుగుతుండగా ఈ కలప పట్టుబడిందని స్థానిక అటవీశాఖ అధికారులు తెలిపారు.

చింతపల్లికి ఉత్సవ శోభ

- నేటి నుంచి ముత్యాలమ్మ జాతర
- నాలుగు రోజులపాటు నిర్వహణ
- అంగరంగ వైభవంగా నిర్వహణకు ఏర్పాట్లు



ఉత్సవంలో భాగంగా ఏర్పాటుచేసిన విద్యుత్ సెట్టింగ్



విద్యుత్ దీపాలంకరణలో ముత్యాలమ్మ తల్లి ఆలయం

చింతపల్లి/చింతపల్లి రూరల్: చింతపల్లిలో ముత్యాలమ్మ జాతర మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. గురువారం వరకు నాలుగు రోజులు పాటు ఆ జాతర అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకునేందుకు తెలుగురాష్ట్రాల నలుమూలల నుంచి తరలి వస్తుంటారు. రెండు రాష్ట్రాల ప్రజలు మొక్కులు తీర్చుకునేందుకు ప్రతి ఏటా జాతరకు వస్తుంటారు.

నాలుగు రోజుల్లో ఇలా.. : జాతర మొదటి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. రెండవ రోజు మంగళవారం అమ్మవారి ఘటాలను సుర్ల అప్పారావు ఇంటి నుంచి భారీ ఊరేగింపుతో స్థానిక కళ్యాణ మండపానికి తరలిస్తారు.బుధవారం సాయంత్రం నుంచి కళ్యాణ మండపం నుంచి అమ్మవారి ఘటాలను చింతపల్లి పురవీధుల్లో ఊరేగింపును వేడుకగా నిర్వహిస్తారు. తెల్లవారుజామున అమ్మవారి ఘటాలను మళ్లీ సుర్ల అప్పారావు ఇంటికి తీసుకు వస్తారు. గురువారం చివరి రోజున అమ్మవారి ఘటాలను ఇంటి నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు భారీ ఊరేగింపుగా తీసుకువెళ్తారు.

చివరిరోజు అట్టహాసంగా.. : ఉత్సవాల చివరిరోజు అట్టహాసంగా ఊరేగింపు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. గిరిజన సంప్రదాయ థింసా నృత్యాలు, కోలాటాలు, కోయ నృత్యాలు ఏర్పాటు చేశారు.

భారీగా విద్యుత్ సెట్టింగ్‌లు : జాతర సందర్భంగా చింతపల్లి ఉత్సవ శోభ సంతరించుకుంది. అంతర్ల నుంచి సంతబయలు వరకు విద్యుత్ దీపాల సెట్టింగులతో అలంకరించారు. గిరిజన ఉత్పత్తుల ప్రదర్శన కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

- ఉత్సవాలకు వచ్చే భక్తులకు తాగునీటి సమస్య తలెత్తకుండా మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.
- ఉత్సవాల విజయవంతానికి ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షురాలు, స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అవసరమైన సహకారం అందిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి



జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశాం. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు రెండు చోట్ల స్టేజ్‌లు ఏర్పాటు చేశాం. జాతర నిర్వాహణకు స్థానికులు, వర్తకసంఘం ప్రతినిధులు సహకరిస్తున్నారు.

– దురియా హేమంత్‌కుమార్, అధ్యక్షుడు, ఉత్సవ కమిటీ

ప్రత్యేక నిఘా ఏర్పాటు



ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించేందుకు డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశాం. అల్లరి మూకలు, సంఘ వ్యతిరేక శక్తులు కదలికలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఉత్సవాల విజయవంతానికి ప్రజలు సహకరించాలి.

– ప్రతాప్ శివకిషోర్, అదనపు ఎస్పీ, చింతపల్లి

రోడ్డున్న ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం

- పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ
- నాలుగు కొత్త ఆర్టీసీ సర్వీసులు ప్రారంభం



సర్వీసులు ప్రారంభించిన అనంతరం బస్సులో ప్రయాణిస్తున్న ఎమ్మెల్యేలు భాగ్యలక్ష్మి, పాల్గుణ

పాడేరు రూరల్ : పాడేరు ఐటీడీఏ పరిధిలోని పక్కా రోడ్డు ఉన్న ప్రతీ గిరిజన గ్రామానికి ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పాడేరు, అరకు ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ తెలిపారు. పాడేరు ఆర్టీసీ డిపోలో ఇటీవల కొత్తగా మంజూరైన పెద్దగూడ, జీకే వీధి, అరకు మార్గాల్లో నాలుగు ఆర్టీసీ బస్సు సర్వీసులను ఆదివారం వారు ప్రారంభించారు. అనంతరం కొంతదూరం వారు ప్రయాణికులతో కలిసి ప్రయాణించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో రోడ్లు సక్రమంగా లేకపోవడంతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని రోడ్లను అభివృద్ధి చేస్తోందన్నారు. రోడ్డు సౌకర్యం అందుబాటులోకి వచ్చిన అనంతరం ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. అన్ని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించి గిరిజనులకు రవాణా సౌకర్యాలు మెరుగు పరుస్తామని వారు పేర్కొన్నారు. పాడేరు ఆర్టీసీ డిపో నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసులు సమయపాలన పాటించేలా, ప్రయాణికులకు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ డీఎం ఆర్ఎస్ నాయుడును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెదబయలు జెడ్పీటీసీ కూడా బొంజుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ ఎం.సరస్వతి, ఎంపీటీసీలు సల్లా చిట్టమ్మ, కె. నర్సింహమూర్తి, రామకృష్ణపాత్రుడు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం

- వేంగడ గిరిజనులు
- ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌కు సత్కారం



డ్రైవర్, కండక్టర్‌ను సత్కరించిన గ్రామస్తులు

అనంతగిరి: మారుమూల వేంగడ పంచాయతీలో ఆదివారం ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులోకి వచ్చాయి. పాడేరు నుంచి అరకు కించుమండ మీదుగా పట్టం నుంచి వేంగడ వరకు ఆర్టీసీ బస్సు సర్వీసు ఆదివారం అందుబాటులోకి వచ్చింది. దీంతో వేంగడ పంచాయతీ గిరిజనులు పెద్ద ఎత్తున రోడ్డు మీదకు వచ్చారు. బస్సు డ్రైవర్, కండక్టర్‌కు గిరిజన సంప్రదాయం నడుమ సత్కరించారు. వారితో కలిసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేగండ సర్పంచ్ సీమ, మాజీ ఎంపీటీసీ గంగన్న మాట్లాడుతూ సీఎం జగన్, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణకు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. మారుమూల గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో తీసుకురావాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే చర్యలు తీసుకున్నారన్నారు.

ఉత్సాహంగా పెద్దవేట ఉత్సవం



సీకరిలో పెద్దవేట కార్యక్రమంలో డప్పు కొట్టి ఉత్సాహపరుస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకుంటున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డప్పు, తుడుము కొట్టి ఉత్సాహపరిచిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే ఇటుక పండగలో భాగంగా మండలంలో సీకరి గ్రామంలో పెద్ద వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం గ్రామ పోతురాజు, శంకుదేవుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం పొలిమేర (వేటబయలు)లో వేట ఉత్సవం నిర్వహించారు. వేటకు ఉపయోగించే ఆయుధాలకు పూజలు చేశారు. వీటితో సోమవారం నుంచి రెండు రోజులపాటు జరిగే వేటకు వెళతారు.

ప్రత్యేక ఆకర్షణగా ఎమ్మెల్యే పాల్గుణ

వేట ఉత్సవం సందర్భంగా అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గిరిజన సంప్రదాయ వాయిద్యాలైన తుడుము, డప్పును కొట్టి గ్రామస్తులను ఉత్సాహపరిచారు. గ్రామస్తులతో కలిసి రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. సర్పంచ్ కృష్ణారావు, ఎంపీటీసీ ఆనందరావు, ,గ్రామ పెద్దలు స్వామి, వెంకటరమణ, మత్స్యవరప్రసాద్ పాల్గొన్నారు.

ఏటికొప్పాక బొమ్మలకు అంతర్జాతీయ ఖ్యాతి

- విపో ఓటింగ్‌లో పాల్గొనేందుకు ఈనెల 23 వరకు అవకాశం
- పదెకరాల్లో రూ.50 లక్షలతో ఇండస్ట్రీ ఏర్పాటు : ఎంపీ సత్యవతి



అనకాపల్లి టౌన్: ఏటికొప్పాక లక్కబొమ్మలకు రంగులు దిద్దేందుకు అదే గ్రామంలో పదెకరాల స్థలంలో రూ.50 లక్షలతో స్మాల్ స్కేల్ ఇండస్ట్రీని ఏర్పాటు చేస్తున్నట్టు ఎంపీ డాక్టర్ సత్యవతి చెప్పారు. స్థానిక వివేకానంద ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రపంచ స్థాయిలో ఈ బొమ్మలకు గుర్తింపు తీసుకొచ్చేందుకు ఈనెల 13వ తేదీ నుంచి 23వ తేదీ వరకు వరల్డ్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్ (విపో)లో జరిగే ఆన్‌లైన్ ఓటింగ్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని ఆమె పిలుపునిచ్చారు. ఇందులో ప్రపంచవ్యాప్తంగా 10 లక్కబొమ్మలకు ఓటింగ్ జరుగుతోందని, పదింట్లో ఏటికొప్పాకకు చెందిన ఐదు లక్కబొమ్మలకు ప్రాధాన్యం లభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ బొమ్మలపై 90 సెకన్ల వీడియో తయారు చేసినట్లు చెప్పారు. ఏటికొప్పాక బొమ్మల ప్రాధాన్యతను పార్లమెంట్‌లో ప్రస్తావించినట్లు చెప్పారు. ఒకే జిల్లా, ఒకే ప్రాజెక్టు కింద అనకాపల్లి జిల్లాలో లక్కబొమ్మలను ఎంపిక చేసినట్లు చెప్పారు. యలమంచిలి ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు సహకారంతో ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదీన కేంద్రానికి నివేదిక సమర్పించామన్నారు. అనకాపల్లి బెల్లానికి ప్రభుత్వ జియో ట్యాగింగ్ కోసం చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

అమృతధారలా అభిమానం



థింసానృత్యాలతో స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు



మంచినీటి కుళాయిలను ప్రారంభిస్తున్న సత్యసాయి సేవాట్రస్టు సాయికృష్ణ, తదితరులు

- అట్టహాసంగా మంచినీటి పథకం ప్రారంభం
- సత్యసాయి ట్రస్ట్ ప్రతినిధి సాయికృష్ణకు ఘన స్వాగతం

గూడెంకొత్తవీధి: మండలంలోని దుచ్చరపాలెంలో ప్రేమామృత ధార కురిసింది. సత్యసాయి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గ్రామంలో నిర్మించిన రక్షిత మంచినీటి పథకాన్ని ఆదివారం ట్రస్టు ప్రతినిధులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఎంతో అట్టహాసంతో నిర్వహించారు. ముందుగానే బిందెలతో స్వాగత తోరణాలు, చీరలతో స్వాగత మార్గాలు ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సత్యసాయి ట్రస్టు ప్రతినిధి సాయికృష్ణకు సంప్రదాయ థింసా నృత్యాలతో స్వాగతం పలికారు. పూలదండలతో వారిని ముంచెత్తి వారి అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం గ్రామంలో పలు చోట్ల నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాపులను ఆయన ప్రారంభించారు. ఏజెన్సీ 11 మండలాల్లోనూ సత్యసాయి సేవా ట్రస్టు ద్వారా ఇప్పటివరకూ సుమారు 550 పథకాలను నిర్మించినట్టు తెలిపారు.అనంతరం సత్యసాయి సేవా ట్రస్టు భజన మండళ్ల ఆధ్వర్యంలో ప్రత్యేక భజన, ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం జరిగింది. చింతపల్లి, గూడెంకొత్తవీధి, జి.మాడుగులతోపాటు ఇతర మండలాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు.అందరికీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో కేవీఎన్‌మూర్తి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

తల్లడిల్లిన మాతృ హృదయం

- తల్లిని తీసుకువచ్చేందుకు బైక్‌పై బయలుదేరిన కొడుకు
- మార్గం మధ్యలో జీపు ఢీకొని మృతి
- దారికాసి రోడ్డు ప్రమాదరూపంలో కబళించిన మృత్యువు



గడుతూరి వెంకటరమణ (ఫైల్)



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి


గూడెంకొత్తవీధి: కట్టెల కోసం వెళ్లిన తల్లిని ద్విచక్ర వాహనంపై తీసుకువద్దామని బయలుదేరిన కొడుకుని మృత్యువు దారి కాసి జీపు రూపంలో కబళించడంతో మాతృ హృదయం తల్లడిల్లిపోయింది . స్థానికుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మండలంలోని చాపరాతిపాలెం గ్రామానికి చెందిన గిరిజన యువకుడు గడుతూరి వెంకటరమణ (25) తల్లి లక్ష్మి ఆదివారం కట్టెల నిమిత్తం సమీప ప్రాంతానికి వెళ్లింది. వర్షం కురిసే అవకాశం ఉన్నందున ద్విచక్రవాహనంపై ఎదురెళ్లి అమ్మను తీసుకువద్దామని కొడుకు వెంకటరమణ బయలు దేరాడు. ఇంతలోనే చింతపల్లి వైపు నుంచి వేగంగా వస్తున్న ఒక ప్రైవేట్ జీపు అతని వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ఘటనలో కిందపడి తీవ్రంగా గాయపడిన వెంకటరమణను స్థానికులు వెంటనే చింతపల్లి ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గం మధ్యలోనే అతను ప్రాణాలు కోల్పోయాడు. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. తనను తీసుకువచ్చేందుకు బయలుదేరిన కన్నకొడుకు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడం ఆ మాతృ హృదయానికి కడుపుకోత మిగిల్చింది. కొడుకు మృతదేహం వద్ద గుండెలవిసేలా రోదించడం అందరినీ కంటతడి పెట్టించింది.

ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

పాడేరు రూరల్: ఐక్య పోరాటాలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం పాడేరులో 104 సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిబ్బందికి సమాన పనికి సమాన వేతనం అందజేయాలన్నారు. పాడైన 104 వాహనాలను బాగు చేయాలని కోరారు.మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు, పవన్‌కుమార్, రామ్మూర్తి, రవిరాజు, వరప్రసాద్, సూర్యనారాయణ పడాల్ పాల్గొన్నారు.

సేవల్లో అత్యుత్తమం.. గ్రేస్

- కొత్తాడ రైతు భరోసా కేంద్రం వీఏఏ పనితీరుకు గుర్తింపు
- ఎనిమిది సార్లు ప్రశంసలు





గ్రేస్, అందుకున్న ప్రశంసా పత్రం

గంగవరం: మండలంలోని కొత్తాడ రైతు భరోసా కేంద్రంలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకురాలు (వీఏఏ) కొర్రాపు గ్రేస్ అందిస్తున్న ఉత్తమ సేవలకు గుర్తింపు లభించింది. ఆమెను రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ అభినందించారు. రైతు భరోసా కేంద్రాల్లో సేవలపై రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ప్రతీనెలా సమీక్ష నిర్వహిస్తారు. దీనిలో భాగంగా జిల్లాలో మండలంలోని కొత్తాడ రైతు భరోసా కేంద్రం వ్యవసాయ సహాయకురాలు గ్రేస్ అందిస్తున్న సేవలు ప్రథమ స్థానంలో నిలిచాయి. గత ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఆమె అందించిన సేవలను గుర్తించిన రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ హరికిరణ్ ప్రశంసా పత్రాలను పంపారు. రాష్ట్ర స్థాయిలో ప్రతి నెలా ప్రచురితమయ్యే వ్యవసాయ మాసపత్రికలో ఆమె సేవలను ప్రశంసిస్తూ ఫొటోను ముద్రించినట్టు మండల వ్యవసాయాధికారి విశ్వనాథ్ తెలిపారు. రైతు భరోసా కేంద్రం ప్రారంభించిన 2021 నుంచి 2023 వరకు గ్రేస్ ఎనిమిది సార్లు ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పాటల పూదోటలో..సాహితీ పరిమళం

- ప్రేక్షకుల ఆదరాభిమానాలే సంగీత ప్రయాణానికి చుక్కాని
- అమ్మే తొలి గురువు
- టీవీ షోలతో గుర్తింపు
- వర్ధమాన గాయని చాగంటి సాహితి





తల్లి, తమ్ముడుతో సాహితి

రాజవొమ్మంగి: అతి పిన్న వయసు నుంచి పాటలు పాడుతూ సంగీత ప్రియులకు గానమాధుర్యాన్ని అందిస్తున్న చాగంటి సాహితి రాజవొమ్మంగిలో పుట్టి పెరిగింది. తండ్రి చాగంటి రవి ప్రసాద్ ఉద్యోగరీత్యా కాకినాడ, ఆ తరువాత హైదరాబాద్‌లో వెళ్లాల్సి రావడంతో సాహితి అక్కడే సంగీతం నేర్చుకొంది. ఆమె రాజవొమ్మంగి మాజీ కరణం వాడ్రేవు సుబ్రహ్మణ్య జగత్పతి మనుమరాలు. తల్లి సీతాదేవి, తమ్ముడు శశాంక్ ఇక్కడికి వచ్చిన ఆమె దేశ విదేశాల్లో తనకు లభిస్తున్న ఆదరణను 'సాక్షి'తో పంచుకుంది. ఆ వివరాలు ఆమె మాటల్లోనే..

- తల్లి సీతాదేవికి పాటలంటే ఎంతో ఇష్టం. దాదాపు 30 ఏళ్ల క్రితం మాట. అప్పట్లో పాడాలని, మంచి గాయనిగా ఎదగాలని ఉన్నా ఆమెకు పరిస్థితులు సహకరించలేదు.
- నేను పొత్తిళ్లలో ఉండగా అమ్మ హనుమాన్ చాలీసా పాడేది. అలా గానం పట్ల ఆసక్తి పెరిగింది. చిన్న వయసులోనే ఆ చాలీసాను అవలీలగా పాడేసేదాన్ని.
- చంటిపిల్లగా ఉన్నప్పుడే అమ్మ సినిమాపాటలు, భక్తిగీతాలు పాడటం నేర్పింది. ఎవరికైనా తొలి గురువు అమ్మేకదా. కాకపోతే తాను గాయని కావాలన్న కోరిక నన్ను గాయనిగా చేసి తీర్చుకుంది. ఆమె రుణం తీర్చుకోలేనిది.
- అమెరికా వంటి దేశాల్లో కూడా ప్రోగ్రాం ఇస్తున్నాను. ఆచార్య, ఆర్ఆర్ఆర్ సినిమాల్లో పాడిన పాటలు నాకు మరింత పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టాయి.
- నాకు 4, 5 ఏళ్ల వయసులో చాలా వరకు అమ్మే సంగీతం నేర్పింది. ఆ తరువాత కాకినాడలో పెద్దాడ సూర్యకుమారి వద్ద కర్నాటక సంగీతం నేర్చుకున్నా. ఆ తరువాత హైదరాబాద్‌లో ఎంసీ మూర్తి వద్ద సుదీర్ఘంగా 10 ఏళ్ళ పాటు సంగీతం నేర్చుకొన్నాను. రామాచారి, శ్రీనిధి వెంకటేష్‌లు నా ప్రస్తుత సంగీత గురువులు.
- ఇప్పటివరకు సుమారు వంద పాటలు పాడాను. ప్రముఖ గాయనిలు లతామంగేష్కర్, ఆశ, జానకి మాదిరిగా పాటలు పాడుతూనే ఉండాలన్నది కోరిక. మణిశర్మ దర్శకత్వంలో పాటలు పాడే అవకాశం లభించడం నా అదృష్టం. ఏఆర్ రెహమాన్, ఇళయరాజా, కీరవాణి నా అభిమాన సంగీత దర్శకులు.
- ఆచార్య, కాటంరాయుడు, ఆచార్య, భీమ్లానాయక్ తదితర సినిమాల్లో పాడిన పాటలు నాకు ఎంతో పేరుతెచ్చిపెట్టాయి. సరిగమప, లిటిల్ చాంప్స్, పాడుతా తీయగా వంటి టీవీ షోల్లో పాడిన పాటలతో చిన్నతనంలోనే ఎంతో గుర్తింపు తెచ్చాయి.
- బద్రీనాథ్ సినిమాలో ఓ చిన్న శ్లోకం ఆలపించే అవకాశం రావడం మరిచిపోలేని మధుర సంఘటన. వాణీజయరాం, బాలసుబ్రహ్మణ్యం, కోటి వంటి ప్రముఖ గాయకులు భుజం తట్టి ప్రోత్సహించారు.
- 2020 నుంచి ఇప్పటివరకు మూడు ఆల్బమ్స్ చేశాను. ప్రేక్షకుల ఆదరాభిమానాలే సంగీత ప్రయాణానికి చుక్కాని.

క్లుప్తంగా

తిమ్మాపురంలో వెంకీ సందడి



వెంకటేష్‌తో ఫొటోలు తీసుకుంటున్న అభిమానులు

కొమ్మాది: భీమిలి బీచ్‌రోడ్డు తిమ్మాపురంలో ఆదివారం సాయంత్రం హీరో విక్టరీ వెంకటేష్ సందడి చేశారు. ఉక్కు నగరంలో జరుగుతున్న సైంధవ్ సినిమా షూటింగ్‌లో ఆయన పాల్గొంటున్నారు. ఆదివారం తన రామానాయుడు స్టూడియోకు చేరుకుని కాసేపు గడిపారు. పర్యాటకులు వెంకటేష్‌ను చూసి ఫొటోలు తీసుకునేందుకు పోటీ పడ్డారు.


79 ఏళ్ల రావిప్రోలుకు ఏయూ డాక్టరేట్



ఉత్తర్వులు స్వీకరిస్తున్న సుబ్రహ్మణ్యం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం గాంధీ అధ్యయన కేంద్రం పరిశోధక విద్యార్థి రావిప్రోలు సుబ్రహ్మణ్యంకు ఏయూ డాక్టరేట్ లభించింది. ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య ఎ.బి.ఎస్.వి రంగారావుల సంయుక్త పర్యవేక్షణలో 'ఏయూ విద్యార్థుల్లో మహాత్మా గాంధీపై అవగాహన' అనే అంశంపై ఆయన పరిశోధన చేశారు. ఈ మేరకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి నుంచి శనివారం డాక్టరేట్ ఉత్తర్వులను స్వీకరించారు. గాంధీజీపై ఉన్న ఆసక్తితో 79 ఏళ్ల వయసులో సుబ్రహ్మణ్యం ఎంతో శ్రద్ధతో డాక్టరేట్ పూర్తి చేయడం విశేషం. గాంధీపై ప్రత్యేకంగా ప్రశ్నావళిని రూపొందించి.. వర్సిటీలో 365 మంది విద్యార్థుల నుంచి సమాచారాన్ని రాబట్టారు. మహాత్ముడిపై ఇష్టంతో వెయ్యికిపైగా పుస్తకాలను సేకరించారు. కోరమండల్ ఫెర్టిలైజర్స్‌లో చీఫ్ కెమిస్ట్‌గా పనిచేసి 2003లో పదవీ విరమణ చేసిన అనంతరం రావిప్రోలు ఎంఏ గాంధీయన్ స్టడీస్ కోర్సును మధురై కామరాజ్ యూనివర్సిటీలో పూర్తి చేశారు. నెల్లూరు జిల్లా పల్లెపాడులో స్థాపించిన పినాకిని సత్యాగ్రహ(గాంధీ) ఆశ్రమం ఎగ్జిక్యూటివ్ సభ్యుడిగా పనిచేశారు.

డ్రోన్‌తో భవిత



- రండి.. డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ పొందుదాం
- ఇంజినీరింగ్, డిగ్రీ విద్యార్థులకు ఏయూ ఆహ్వానం
- శిక్షణ, నిర్వహణ, తయారీపై వర్సిటీలో కేంద్రం

డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి (ఫైల్)



డ్రోన్లపై పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు

సాక్షి, విశాఖపట్నం: ప్రస్తుత రోజుల్లో సందడంతా డ్రోన్లదే. వ్యవసాయం, పెళ్లిళ్లు, భూముల సర్వే, మందుల పంపిణీ, సినిమా షూటింగ్‌లు, యూట్యూబ్ వీడియోలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏరియల్ సర్వే.. ఇలా పలు సందర్భాల్లో డ్రోన్ల వినియోగం గణనీయంగా పెరిగింది. సాంకేతికతో సాయంతో వీటికి దిశానిర్దేశం చేస్తే.. లక్ష్యాన్ని అందుకుంటాయి. అయితే వీటిని నడిపే మానవ వనరుల కొరత ఉంది. నిర్వహణ సామర్థ్యాలు పెంచుకోవడం, ఖర్చును తగ్గించుకునే విషయంలో ఇప్పుడు అందరి ఆలోచన డ్రోన్ టెక్నాలజీ.. ప్రస్తుతం డ్రోన్ల సేవలు విస్తరిస్తున్న తరుణంలో విద్యార్థులను డ్రోన్ టెక్నాలజీలో సుశిక్షితులను చేసేందుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం సన్నద్ధమైంది. ఇందులో పరిశోధనల కోసం డ్రోన్ టెక్నాలజీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.

కేంద్ర ప్రభుత్వ నివేదిక ప్రకారం 2022లో డ్రోన్ అంకుర సంస్థల వృద్ధి 34.4 శాతంగా నమోదైంది. డ్రోన్ టెక్నాలజీ సంస్థల్లో పెట్టుబడులూ వెల్లువెత్తుతున్నాయి. డ్రోన్ సేవల మార్కెట్ విలువ దేశీయంగా రెండేళ్ల కిందట 13.04 కోట్ల డాలర్లుగా నమోదైంది. 2030 నాటికి ఇది 400 కోట్ల డాలర్లకు పురోగమిస్తుందని నిపుణులు అంచనా. వివిధ రంగాలకు అవసరమైన డ్రోన్లు, వాటి విడిభాగాలను తయారు చేసుకోవడంలో భారత్.. ఇంకా స్వయం సమృద్ధి సాధించలేదు. సరైన ప్రణాళికలు, ప్రోత్సాహం అందిస్తే స్టార్టప్ సంస్థల సహకారంతో దేశంలో తయారీ సామర్థ్యం మరింత పెరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో విద్యార్థులు డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకునేలా సరికొత్తగా ఇన్నోవేషన్ సెంటర్ ఆఫ్ డ్రోన్ టెక్నాలజీస్(ఐసీడీటీ) కేంద్రాన్ని ఏయూ ఏర్పాటు చేసింది.

యూనివర్సిటీల చరిత్రలో తొలిసారిగా..

డ్రోన్ టెక్నాలజీ పరిశోధలనలపై ఈ తరహా కేంద్రాన్ని ఇంత వరకూ ఏ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయలేదు. మొదటిసారిగా ఆంధ్ర విశ్వవిద్యాలయం ఈ టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఏయూ ప్రాంగణంలోని హెలిప్యాడ్ గ్రౌండ్స్‌ను ఆనుకొని దీన్ని ప్రారంభించారు. డ్రోన్లకు సంబంధించిన పైలట్, అప్‌స్కిల్లింగ్, ట్రైనింగ్, అసెంబుల్, నూతన సాంకేతికత మొదలైన అన్ని అంశాల్లోనూ ఇక్కడ పరిశోధనలు జరగనున్నాయి. డ్రోన్ల నిర్వహణ, తయారీ అంశాలపై పరిశోధనలు చేసే కేంద్రంగా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఏయూలో ఏ కోర్సు చదివే విద్యార్థులైనా ఇక్కడ అందించే కోర్సుల్లో చేరి తమ నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం కల్పిస్తోంది. విద్యార్థులకు ప్రత్యక్ష అవగాహన కల్పించడానికి హెలీపాడ్ మైదానాన్ని వినియోగించనున్నారు. ఈ సెంటర్‌లో డ్రోన్ వినియోగం, డ్రోన్ టెక్నాలజీపై భవిష్యత్ పరిశోధనలు నిర్వహించేలా మరింత అభివృద్ధి చేసేందుకు ఏయూ ప్రణాళికలు సిద్ధం చేసింది.

సర్టిఫికెట్ ప్రోగ్రాంగా అందిస్తున్నాం

దేశాన్ని డ్రోన్ల కేంద్రంగా మార్చాలని కేంద్రం, వివిధ రంగాల్లో డ్రోన్ల వినియోగం విస్తృతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి. అయితే వేగంగా విస్తరిస్తున్న భారతీయ డ్రోన్ పరిశ్రమకు నిపుణులైన మానవ వనరుల కొరత వేధిస్తోంది. దీన్ని అధిగమించేలా తొలిసారిగా డ్రోన్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏయూలో ప్రారంభించాం. ఐసీడీటీను పరిశోధన కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రోగ్రాం కూడా అందిస్తున్నాం. ఇంజినీరింగ్ విద్యార్థులతో పాటు ఏయూ పరిధిలోని డిగ్రీ విద్యార్థులు కూడా ఈ శిక్షణలో చేరేందుకు అవకాశం కల్పిస్తున్నాం.

– ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, వీసీ, ఏయూ

చదువుతో పాటు ఆటలూ ముఖ్యమే!



రూపేష్ మక్వానాతో కలిసి పరుగుయాత్రలో పాల్గొన్న భారత స్వాభిమాన్ ట్రస్టు సభ్యులు

అనకాపల్లి టౌన్: యువత చదువుతోపాటు క్రీడల పట్ల దృష్టి సారించాలని గుజరాత్‌కు చెందిన క్రీడాకారుడు రూపేష్ మక్వానా అన్నారు. సేవ్ నేషన్.. సేవ్ యూత్ నినాదంతో 95 రోజుల క్రితం ఢిల్లీలో పరుగుయాత్ర ప్రారంభించిన రూపేష్ మక్వానా ఆదివారం మండలంలో కొత్తూరు కూడలికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత సెల్‌ఫోన్లు, మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. పరుగుయాత్రలో ప్రపంచ రికార్డు వచ్చిందని, ఆ రికార్డును బ్రేక్ చేస్తూ అందరిలోనూ స్ఫూర్తి నింపుతూ మరింత ఉత్తమమైన రికార్డును అందించేందుకు మరికొంత మంది యువత ముందుకురావాలన్నారు. ఈ యాత్ర మహారాష్ట్ర, చెన్నై, ఆంధ్రప్రదేశ్, కోల్‌కత్తా మీదుగా తిరిగి ఢిల్లీ చేరుకుంటుందని పేర్కొన్నారు. రోజుకు 70 కిలోమీటర్ల పరుగుయాత్ర ద్వారా ప్రస్తుతానికి 6 వేల కిలోమీటర్లు సాగిందన్నారు. పట్టణానికి చేరుకున్న రూపేష్ మక్వానాను భారత స్వాభిమాన్ ట్రస్టు, పతంజలి యోగా జిల్లా అధ్యక్షుడు టీఎస్‌వీ ప్రసాదరావు, యోగా సభ్యులు దొరమనాయుడు, పూర్వపు అధ్యక్షులు సాయి, నాగేశ్వరరావు, ప్రభాకర్, నాగేశ్వరరావులు ఘన స్వాగతం పలికి సత్కరించారు.

జగనన్న పాలనలోనే అభివృద్ధి

రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

రాజవొమ్మంగి: జగనన్న పాలనలోనే మన్యంలో శరవేగంగా అభివృద్ధి జరుగుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని చెరకుంపాలెం సచివాలయ పరిధిలోని కొత్త వెలగలపాలెం, పాత వెలగలపాలెం గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి చీకటి పడే వరకు సుమారు 220 గడపలను ఎమ్మెల్యే ధనలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాత వెలగలపాలెంలో ఆవాల మల్లికార్జునరావు పక్షవాతం వచ్చి దాదాపు 9 సంవత్సరాలుగా మంచానికే పరిమితమైనట్టు భార్య అపర్ణ ఎమ్మెల్యే దృష్టికి తీసుకొని వెళ్లారు. దీంతో ఆ కుటుంబ వివరాలు సేకరించి జీవనోపాధికి పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామన్నారు. గ్రామస్తులకు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. మహిళలు పూలమాలలు వేసి, బొట్టు పెట్టి నీరాజనాలు పట్టారు. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట ఇచ్చారు. మర్రిపాలెంలో ఎమ్మెల్యే ధనలక్ష్మిను ఆదివాసీ జేఏసీ సభ్యులు కలిసి బోయవాల్మీకి, బొంతు ఒరియా కులాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ రైతుల సమస్యలపై లిఖితపూర్వకంగా వినతి పత్రం ఇవ్వాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకొని వెళతానన్నారు. ఆందోళనకారులకు సీఐ బాజీలాల్ సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, సచివాలయ మండల కన్వీనర్ కొంగర మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, ఎంపీటీసీ గంగదుర్గ, నాయకులు రవి, కామేష్, చంద్రుడు, శాంతకుమారి, ఎంపీడీఓ బాపన్నదొర, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చందనోత్సవానికి శ్రీకారం

తొలివిడత చందనం అరగదీత ప్రారంభం



తొలి చందనం చెక్కతో ఆలయ బేడా ప్రదక్షిణ చేస్తున్న ప్రధానార్చకుడు శ్రీనివాసాచార్యులు, ఈవో త్రినాథరావు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఆదివారం నుంచి తొలి విడత చందనం అరగదీత కార్యక్రమం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. ఈ నెల 23న వైశాఖ శుద్ధ తదియ రోజు శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవం(నిజరూప దర్శనం) జరగనుంది. ఆ రోజు రాత్రి స్వామికి తొలి విడతగా సమర్పించాల్సిన మూడు మణుగుల (120 కిలోలు) పచ్చి చందనం సమకూర్చేందుకు ఈ అరగదీత కార్యక్రమాన్ని చేపట్టారు. పాంచరాత్ర ఆగమశాస్త్రాన్ని అనుసరించి ఉదయం 6.05 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకులు నిర్వహించారు. తొలుత బేడా మండపంలోని బాండాగారం వద్ద తొలి చందనం చెక్కను ఉంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. అనంతరం ఆ చందనం చెక్కతో ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల మధ్య బేడా ప్రదక్షిణ చేశారు. అనంతరం నోటికి గంతలు కట్టుకుని శ్రీనివాసాచార్యులు తొలి చందనాన్ని అరగదీశారు. ఆలయ ప్రధానార్చకుడు–2 ఇరగవరపు రమణాచార్యులు, స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, దేవస్థానం ఈవో వి.త్రినాథరావు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు చందనాన్ని అరగదీశారు. ఈ చందనాన్ని స్వామి మూలవిరాట్‌కి సమర్పించారు. అనంతరం 15 మంది నాలుగో తరగతి సిబ్బంది చందనం అరగదీతను ప్రారంభించారు. అర్చకులు గిరి, పెద్దరాజు, కుమార్ పూజలు నిర్వహించారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్‌రాజ్, సంపంగి శ్రీనివాసరావు, దొడ్డి రమణ, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, వంకాయల సాయినిర్మల, ప్రత్యేక ఆహ్వానితుడు చందుయాదవ్, డిప్యూటీ ఈవో సుజాత కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ ఏఈవో ఇజిరోతు శ్రీనివాసరావు, ఆలయ ఇన్‌స్పెక్టర్ ఎస్.కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా ప్రధానార్చకుడి హోదాలో తొలిసారి తొలి చందనాన్ని అరగదీసే అవకాశం గొడవర్తి శ్రీనివాసాచార్యులకు దక్కింది. గడిచిన కొన్నేళ్లుగా తొలి చందనాన్ని ఆలయ ప్రధానార్చకులే తీస్తున్నారు. గతంలో ఇన్‌చార్జి ప్రధానార్చకుడిగా రెండుసార్లు తొలి చందనం అరగదీసిన శ్రీనివాసాచార్యులు ఈ సారి ప్రధానార్చకుడి హోదాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చందనోత్సవం ఏర్పాట్ల పరిశీలన

సింహాచలం : చందనోత్సవంలో సాధారణ భక్తుల దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు నగర సీపీ డాక్టర్ త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. సింహగిరిపై జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం సీపీ పరిశీలించారు. ఉచిత దర్శనం, రూ.300, రూ.1000, రూ.1500 టికెట్ల దర్శనం క్యూలు ఎక్కడెక్కడ నుంచి ప్రారంభమవుతాయో, ఎంత దూరం క్యూల్లో నడవాల్సి వస్తుందో పరిశీలన చేశారు. సింహాచలం దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు ఆయా ఏర్పాట్ల ప్రణాళికను సీపీకి వివరించారు. జనరల్ క్యూల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్‌లు పక్కా ఉండాలని అధికారులకు సూచించారు. అలాగే క్యూల్లో మంచి నీరు, టాయిలెట్లు పక్కాగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో నగర డీసీపీ ఆనంద్‌రెడ్డి, నార్త్ ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, గోపాలపట్నం సీఐ నరసింహారావు, దేవస్థానం ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు నాటక రంగ దినోత్సవం

సీతమ్మధార: ద్వారకానగర్ టీఏ స్వార్ కాంప్లెక్స్‌లోని రంగసాయి నాటక గ్రంథాలయంలో ఆదివారం తెలుగు నాటక రంగ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మూడు దశాబ్దాలుగా ఎన్నో నాటికలు, నాటకాలు ప్రదర్శిస్తున్న కళాకారులు ఎం.శివజ్యోతి, వద్రే నాంచారయ్య, సీవీఆర్ మూర్తి, ఇప్పిలి ఆదినారాయణలను రంగసాయి నాటక సంఘ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎం.వి.సుబ్రహ్మణ్యం బృందం ప్రదర్శించిన లఘు నాటిక కడుపుబ్బా నవ్వించింది. జాగ్రత్త నాటిక ఆలోచింపజేసింది. బాదంగీర్‌సాయి దంపతులను రంగస్థల నటులు ఘనంగా సత్కరించారు. మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రంగస్థల ప్రముఖులు చలసాని కృష్ణప్రసాద్, బొబ్బా ధవళేశ్వరరావు, కె.వి.ఎస్.డి ప్రసాద్, గెద్ద వరప్రసాద్, పి.శివప్రసాద్, డాక్టర్.కృష్ణమూర్తి, ఎస్ఎస్ఆర్, సీనియర్ నటి హేమ, జమ్మా, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పది 'స్పాట్'కు రెడీ..!

- మూల్యాంకనానికి సర్వం సిద్ధం
- జిల్లాకు 2.07లక్షల టైటిల్స్
- పేపర్లు దిద్దేందుకు 2,095 మంది ఉపాధ్యాయులు
- నిఘా నీడలో క్వీన్ మేరీ స్కూల్
- ఈ నెల 19 నుంచి 26 వరకు స్పాట్ వాల్యూయేషన్
- మే రెండో వారంలో ఫలితాలు విడుదల



స్పాట్ కేంద్రం క్వీన్ మేరీ స్కూల్‌లో సీసీ కెమెరాల పర్యవేక్షణ



క్వీన్ మేరీ పాఠశాలలో సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

విశాఖ విద్య : పదో తరగతి స్పాట్ వాల్యూషన్‌పై జిల్లా విద్యాశాఖాధికారులు ఫోకస్ పెట్టారు. పరీక్షలు ఈ నెల 18తో ముగియనుండగా, ఆ మరుసటి రోజునుంచే జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభించేలా కార్యాచరణ సిద్ధం చేశారు. విశాఖ నగరంలోని క్వీన్‌మేరీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాకు ఈసారి సుమారుగా 2.07 లక్షల టైటిల్స్(జవాబు పత్రాలు) వస్తాయని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. 26 నాటికి మూల్యాంకనం ప్రక్రియ పూర్తి చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్. మురళీ మోహన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. స్పాట్ కేంద్రంగా ఎంపిక చేసిన క్వీన్ మేరీ పాఠశాలలో సిబ్బందితో మకాం వేసి ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

విధుల్లో 2,095 మంది ఉపాధ్యాయులు

మూల్యాంకనం విధులకు జిల్లాకు చెందిన 2,095 మంది ఉపాధ్యాయులను నియమించారు. వీరిలో 1,340 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్స్, 540 మంది స్పెషల్ అసిస్టెంట్స్, 215 మంది చీఫ్ ఎగ్జామినర్స్ ఉన్నారు. అనుకున్న గడువులోగా మూల్యాంకనం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల సంచాలకులు డీ. దేవానందరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో మూల్యాంకనం లేనందున, అవసరమైతే అక్కడి ఉపాధ్యాయులను సైతం విశాఖ జిల్లాలో వినియోగించుకోవాలని విద్యాశాఖాధికారులు భావిస్తున్నారు.

మూల్యాంకనంపై నిశిత పరిశీలన

జవాబు పత్రాల మూల్యాంకంపై విద్యాశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. అసిస్టెంట్ ఎగ్జామినర్ ఒక్క రోజులో 40 జబాబు పత్రాలను మాత్రమే దిద్దాల్సి ఉంటుంది. మూల్యాంకనం వాస్తవికతను ధ్రువీకరించేలా అసిస్టెంట్ ఎగ్జామినర్ దిద్దిన ప్రతీ 60లో 20 జవాబు పత్రాలను చీఫ్ ఎగ్జామినర్ తప్పనిసరిగా పరిశీలించనున్నారు. అసిస్టెంట్ క్యాంప్ అధికారి, డిప్యూటీ క్యాంప్ అధికారిగా వ్యవహరించే వారు సైతం అసిస్టెంట్ ఎగ్జామినర్ దిద్దిన జవాబు పత్రాలపై నిశిత పరిశీలన చేసేలా విధి విధానాలు రూపొందించారు. పరీక్ష రాసిన విద్యార్థులకు నష్టం వాటిల్ల కూడదనే ఉద్దేశంతోనే ఇటువంటి ఏర్పాట్లు చేశామని పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ దేవానందరెడ్డి తెలిపారు.

క్వీన్ మేరీ స్కూల్లో పటిష్ట భద్రత

క్వీన్ మేరీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఈ నెల 19 నుంచి 26 వరకు పాఠశాలలోని తరగతులను పోర్ట్‌బే, సమీపంలోని ప్రాథమిక పాఠశాలల్లో గల భవనాల్లోకి తరలిస్తున్నట్లు హెచ్‌ఎం ధర్మేంద్ర రెడ్డి తెలిపారు. పాఠశాల ఎంట్రన్స్ మొదలుకొని, మూల్యాంకనం జరిగే అన్ని తరగతి గదుల్లో సీసీ కెమెరాలను అమర్చారు. వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి తరచూ పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

18న రిపోర్ట్ చేయాలి



పదో తరగతి మూల్యాంకనంకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా శ్రద్ధ తీసుకుంటున్నాం. విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులంతా ఈ నెల 18 సాయంత్రం నాటికి తప్పనిసరిగా క్వీన్ మేరీ స్కూల్‌లో రిపోర్ట్ చేయాలి.

– ఎస్. మురళీ మోహన్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్, విశాఖ జిల్లా

మే రెండో వారంలో ఫలితాలు



మూల్యాంకనం సకాలంలో పూర్తయితే దృష్టి సారించాం. విద్యార్థులు చాయిస్‌కు మించి ప్రశ్నలకు జవాబులు రాసినట్‌లైతే, ఎక్కువ మార్కులు పొందిన వాటినే పరిగణలోకి తీసుకునేలా ఆదేశాలు ఇచ్చాం. ఏ ఒక్క విద్యార్థికీ నష్టం కలుగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. మే రెండో వారంలో ఫలితాలు విడుదల చేసేలా కసరత్తు చేస్తున్నాం.

– డీ. దేవానందరెడ్డి, ఏపీ ప్రభుత్వ పరీక్షల రాష్ట్ర డైరెక్టర్

ప్రకృతి సాగు.. ఆదరణ బాగు

- తక్కువ ఖర్చుతో ఆరోగ్యకర పంటల దిగుబడి
- ఆర్గానిక్ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్
- ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి
- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు



ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను తెలిపే ముగ్గును పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. తారువలో ఆదివారం రైతులకు నవధాన్యాల సాగు, అంతర పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ సంఘ నిర్వాహక ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) ఖరీఫ్ కార్యప్రణాళిక ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా జరిగిన ఈ కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికలు, కరపత్రాలను డిప్యూటీ సీఎం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతులకు విత్తనాలను అందజేశారు. అనంతరం ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రకృతి సాగు పద్ధతుల్లో జీవామృతం, బీజామృతం వంటి వాటిని ఉపయోగించి, ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలు పాటించి మెరుగైన వ్యవసాయ దిగుబడులు సాధించాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంటల దిగుబడిని పొందవచ్చునన్నారు. మార్కెట్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేసిన పంటల ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, ఈ నేపథ్యంలోనే రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేపట్టాలని సూచించారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం లచ్చన్న మాట్లాడుతూ జిల్లాలో 164 గ్రామాల్లో 38,550మంది రైతులు 45,083 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారని చెప్పారు.

వీరికి 7925 స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా సమావేశం ఆవరణలో ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పించేలా తీర్చిదిద్దిన ముగ్గు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్థానిక సర్పంచ్ గొంప వరహాలమ్మ, ఏపీసీఎన్ఎఫ్ రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్, అడిషనల్ డీపీఎం గోవింద్, మాస్టర్ ట్రైనర్ నాగమణి, మర్రింనాయుడు, నాలుగు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.